క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో శివపార్వతుల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



ఊరేగింపులో భక్తులు

రాజవొమ్మంగి: మహాశివరాత్రి ఉత్సవాలు రాజవొమ్మంగిలో ఆదివారంతో ముగిశాయి. వేడుకలో భాగంగా స్థానిక శివాలయం కొండ పై వేంచేసి ఉన్న రాజరాజేశ్వరి సమేత రామ లింగేశ్వరస్వామి వారి ఆలయంలో మహాశివ రాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కార్యక్ర మాల్లో భాగంగా శివ, పార్వతుల ఉత్సవ విగ్ర హాలను పల్లకీలో ఏర్పాటు చేసి గ్రామంలో ఊరేగించారు. భక్తులు పూజలు చేసి, నైవేద్యా లు సమర్పించారు. పురోహితులు శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు పెద్దిరాజు, సత్తిబాబు, మధు తదితరులు పాల్గొన్నారు.

సరుగుడు జలపాతం వద్ద సందడి



సరుగుడు జలపాతం

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులతో సందడిగా మారింది. ఇక్కడ ఎత్తయిన రెండు కొండల మధ్యలోంచి జాలువారే నీటిలో జలకాలాడుతూ సరదాగా గడిపారు. ఉమ్మడి విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు రావడంతో ఈ ప్రాంతంలో కోలాహలం నెలకొంది. ఉదయం నుంచి సాయత్రం వరకు ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు.


రేపటి నుంచి మోదమాంబ తీర్థ మహోత్సవాలు



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

బుచ్చెయ్యపేట: మండలంలో వడ్డాది జంక్షన్‌లో మోదకొండమ్మ తీర్థ మహోత్సవాలు ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు మోదమాంబ ఉత్సవ కమిటీ వారు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా 4న అమ్మవారికి ధూపదీప, నైవేద్యాలతో ప్రత్యేక పూజలు, అదే రోజు రాత్రి 8 గంటలకు యలమంచిలి వారి భలే పిల్లలు నృత్య ప్రదర్శన, 5న అమ్మవారికి పూజలు, 6న రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

బాల వికాస్ విద్యార్థుల విహారయాత్ర



బొజ్జన్నకొండ వద్ద బౌద్ధ విశేషాలను వివరిస్తున్న రామలక్ష్మి

కె.కోటపాడు: స్థానిక బాల వికాస్ కేంద్రం గురువు బండారు రామలక్ష్మి ఆధ్వర్యంలో 66 మంది విద్యార్థులు ఆదివారం ఆధ్యాత్మిక విహారయాత్రకు తరలివెళ్లారు. ఇందులో భాగంగా అనకాపల్లి సమీపంలో బొజ్జన్నకొండను సందర్శించారు. అక్కడ బౌద్ధ విశేషాలను విద్యార్థులకు గురువు రామలక్ష్మి వివరించారు. అనంతరం విద్యార్థులతో వేదం, భక్తి కోలాటం కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కశిరెడ్డి అప్పలనాయుడు, కె.కోటపాడు కన్వీనర్ బండారు నారాయణ పాత్రుడు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ

యలమంచిలి రూరల్: మార్షల్ ఆర్ట్స్ జీవితంలో అత్యవసర సమయాల్లో ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని ఫొటో కాన్ ఇండియా కరాటే జూడో అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ చీఫ్ బోధకుడు పి.నరసింహారావు అన్నారు. ఆదివారం స్థానిక వాగ్దేవి జూనియర్ కళాశాలలో యలమంచిలి మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ సీనియర్ కరాటే మాస్టర్ నక్కా వెంకటరమణ రంగా ఆధ్వర్యంలో సెమినార్, బెల్ట్ గ్రేడింగ్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇండియా కరాటే అసోసియేషన్ ఏపీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ జి.శివరామకృష్ణ హాజరయ్యారు. విద్యార్థినీ, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా కరాటే బెల్ట్ గ్రేడింగ్‌లో పాల్గొని విజయం సాధించారు. అనంతరం అర్హత సాధించిన వారికి బెల్ట్, సర్టిఫికెట్లు అందజేశారు. నక్కా శివ శంకర్‌రావు, అడపా శేషగిరిరావు, దాడి రమేశ్, పి.పృథ్వీరాజ్, పి.రమేశ్, కె.శ్రీను, కేవీ శ్యామ్ పాల్గొన్నారు.

భవనాలకు మోక్షమెన్నడో



చింతపల్లిలో నిరుపయోగంగా ఉన్న జిల్లా పరిషత్ అతిథి గృహం

- శిథిలావస్థలో గ్యాస్ గొడౌన్
- బీటల వారిన గోడలు. పాడైన పైకప్పు
- తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు



బీటలు వారిన గోడ



ముంచంగిపుట్టులో శిథిల దశకు చేరిన జీసీసీ గ్యాస్ గొడౌన్

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఉన్న జీసీసీ భారత్ గ్యాస్ గొడౌన్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. భవనం గోడలు బీటలు వారి, గచ్చు పాడైపోయింది. భవనం పైకప్పు రేకులు దెబ్బతిన్నాయి. దీంతో గ్యాస్ గొడౌన్ నిర్వాహకులు, సిబ్బంది భయపడుతూ నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. గ్యాస్ సిలిండర్లు భద్రపరించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. భవనం నిర్మించి పదేళ్లు కావస్తున్నా నేటి వరకు మరమ్మతు పనులు చేయలేదు దీంతో గొడౌన్ పరిస్థితి దారుణంగా ఉంది. ఈ భవనం గోడలు బీటలు వారి ఉండడంతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. భవనం పైకప్పు రేకులకు రంధ్రాలు ఏర్పడడంతో వర్షం పడినపుడు పలు చోట్ల నీరు కారుతుంది. గచ్చు పూర్తిగా పాడైపోయింది. వర్షం పడినపుడు గదుల్లో నీరు చేరుతోందని, రికార్డులు పాడైపోతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గ్యాస్ సిలిండర్లు భద్రపరిచేందుకు ఆటంకం కలుగుతుందని చెబుతున్నారు. గ్యాస్ సిలిండర్ల గోదాము కావడంతో అధికారులు పూర్తి భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని స్థానికులతో పాటు సిబ్బంది చెబుతున్నారు. ఇటీవల జీసీసీ ఉన్నతాధికారులు తనిఖీ చేసినపుడు గ్యాస్ గొడౌన్ పరిస్థితిని స్థానికులు, సిబ్బంది వివరించారు. ఇప్పటికైనా జీసీసీ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే గ్యాస్ గొడౌన్‌కు మరమ్మతులు చేయాలని లేనిపక్షంలో కొత్త భవనం నిర్మించాలని వారు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

నిరుపయోగంగా అతిథి గృహాలు

చింతపల్లి: మండల కేంద్రంలో ఉన్న అతిథి గృహాలు నిరుపయోగంగా మారాయి. పేరుకు రెండు అతిథి గృహాలు ఉన్నప్పటికీ వినియోగంలో లేవు. గతంలో ఉన్నటువంటి జిల్లా పరిషత్ అతిథి గృహం, ఆర్‌అండ్‌బీ అతిథి గృహాలు ఈ ప్రాంతానికి వచ్చే అధికారులు, అనధికారులు, ప్రజాప్రతినిధులకు ఆతిథ్యమిచ్చేవి. దీంతో వసతి సమస్య ఉండేది కాదు. ఈ అతిథి గృహాలతో పాటు ఐటీడీఏ, కాఫీ, ఫారెస్టు, అటవీ అభివృద్ధి సంస్థ, పోలీసు శాఖకు సంబంధించిన అతిథి గృహాలు ఆయా శాఖాధికారులతో పాటు ప్రజాప్రతినిధులకు వసతి సమస్య లేకుండా అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం ఏ అతిథి గృహం కూడా అందుబాటులో లేకుండా లేకపోవడంతో ఈ ప్రాంతానికి వచ్చే అధికారులు, అనధికారులతో పాటు ప్రజాప్రతినిదులు కూడా వసతి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు.

రెండు అతిథి గృహాల పరిస్థితి ఒక్కటే

చింతపల్లిలో ఉన్న పురాతన ఆర్‌అండ్‌బీ, జిల్లా పరిషత్ అతిథి గృహాలు దశాబ్దాల పాటు ఈ ప్రాంతానికి వచ్చే ప్రముఖులకు ఆతిథ్యమిచ్చింది. ఈ రెండు అతిథి గృహాలను మావోయిస్టులు పేల్చివేశారు. దీంతో నూతనంగా ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నిర్మాణం జరిగినా కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించక పోవడంతో నిరుపయోగంగా మారింది.



పాడైన గ్యాస్ గొడౌన్ గచ్చు

అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా భవనం వినియోగంలోనికి రాకుండా పోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్నటువంటి అతిథి గృహాలను వినియోగంలోనికి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

ముంచంగిపుట్టు భారత్ గ్యాస్ గోదాము శిథిలదశలో ఉంది. మరమ్మతులు చేసేందుకు అవసరమైన నిధుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు విడుదలైన వెంటనే మరమ్మతు పనులు చేయిస్తాం. సిలిండర్లు భద్రపరిచేందుకు తగు జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి సూచించాం.

– డి.సింహాచలం, జీసీసీ డీఎం, పాడేరు

పకడ్బందీగా ‘ఏకలవ్య’ ఎంట్రన్స్ టెస్ట్



ముంచంగిపుట్టులో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



అడ్డతీగలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



చింతపల్లి ఏపీ గురుకుల కళాశాలలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



డుంబ్రిగుడ బాలికల ఆశ్రమ పాఠశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు



ప్రవేశపరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు

అడ్డతీగల: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఆరవ తరగతి ప్రవేశ పరీక్షకు 513 మంది విద్యార్థులు హాజరయ్యారు. అడ్డతీగల గురుకుల పాఠశాలలో ఆదివారం జరిగిన ప్రవేశ పరీక్షకు 551 మంది విద్యార్థులకు ఈ పరీక్షా కేంద్రానికి కేటాయించినట్టు ప్రిన్సిపాల్ హరినాథ్ తెలిపారు. 38 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్టు తెలిపారు. ఈ ప్రవేశపరీక్షకు 23 గదులను కేటాయించగా, ఒక్కో గదికి 24 మందికి మాత్రమే అనుమతించినట్టు పేర్కొన్నారు.

చింతపల్లి: ఏకలవ్య పాఠశాలల్లో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన అర్హత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. చింతపల్లి, కొయ్యూరు మండలాలకు సంబంధించి ప్రవేశ పరీక్ష కేంద్రాలను చింతపల్లిలో మూడు చోట్ల ఏర్పాటు చేశారు. ఆరో తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఈ పరీక్షకు చింతపల్లి ఏకలవ్య పాఠశాలతో పాటు ఏపీ గురుకుల జూనియర్ కళాశాల, వైటీసీలో వీటిని నిర్వహించారు. మునుపెన్నడూ లేని విధంగా ఈసారి ఆరోతరగతి ప్రవేశ పరీక్ష కోసం విద్యార్థులు పోటీ పడ్డారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

డుంబ్రిగుడ: మండలంలోని ప్రభుత్వ బాలిక ఆశ్రమ పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. నాయకులు అనిల్, గణేష్ మాట్లాడుతూ ప్రజ్ఞ వికాస్ పేరిట నిర్వహించిన పరీక్షకు 150 మంది హాజరైనట్టు తెలిపారు. పబ్లిక్ పరీక్షలపై విద్యార్థుల్లో భయం పోగొట్టి, ముందస్తుగా సిద్ధమవడానికి ఈ టాలెంట్ పరీక్ష నిర్వహించామన్నారు. ఈ పరీక్షలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. నేతలు చిన్నారావు, బాబూరావు, విష్ణు, దాసు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం ఏకలవ్య ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్టు పాఠశాల ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం తెలిపారు. పాఠశాలలో 282 మందికి గాను 264 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్టు పేర్కొన్నారు. వై.రామవరం గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ పరీక్షను పర్యవేక్షించారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఆదివారం ఎస్ఎఫ్ఐ,యూటీఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞ వికాస్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. కిలగాడ, జోలాపుట్టు, ముంచంగిపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు చెందిన 150 విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధర్మారావు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలపై భయం విడాలన్నారు. ఒత్తిడిని తట్టుకొనేందుకు టాలెంట్ టెస్ట్ నిర్వహించామని, దీనిని సద్వినియోగం చేసువాలని కోరారు. నేతలు ధనుపతి, చిన్నయ్య, శ్రీనివాసమూర్తి, ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు అతిథిరం, కామేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



ఆలయ నిర్మాణానికి పూజలు చేస్తున్న వేదపండితులు, భక్తులు

చింతపల్లి: మండల కేంద్రంలోని పెదపైపు వీధిలో కృష్ణుని నూతన ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు చర్యలు చేపట్టారు. ఇక్కడ గతంలో ఉన్న ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. దీన్ని పూర్తిగా తొలగించి నూతన ఆలయాన్ని నిర్మించాలని స్థానికులు నిర్ణయించారు. ఇందుకు సుమారు రూ.15లక్షల వరకు ఖర్చవుతున్నట్టు అంచనా వేశారు. విరాళల రూపంలో ఆయా నిధులను వసూలు చేసి ఆలయాన్ని నిర్మించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం నూతన ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. వర్తక, యాదవ సంఘం నాయకులు బేతాళుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

23న అష్టలక్ష్మి యాగం



భూమిపూజ నిర్వహిస్తున్న అర్చకులు

ఎటపాక: మండల కేంద్రంలోని ఈనెల 23న అష్టలక్ష్మి యాగం నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు పీతాంబరం రఘునాథాచార్యుల స్వామిజీ తెలిపారు. ఈ మేరకు అష్టలక్ష్మీ పీఠం ఆధ్వర్యంలో ఉష్ణగుండాల సమీపంలోని నిర్వహించనున్న స్థలంలో ఆదివారం భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక పూజలు, భూమిపూజ చేశారు. యాగ స్థలంలో హోమం నిర్వహించి ఏర్పాట్లకు అంకురార్పన చేశారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు నాగేశ్వరరావు, మాధవరెడ్డి, సురేష్, సత్యనారాయణ, భాస్కర్, ఎంపీటీసీ సభ్యుడు వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలపై పడిన భారీ వృక్షం

- నిలిచిన విద్యుత్ సరఫరా
- అంధకారంలో గ్రామాలు




కిలగాడలో చీకట్లో మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు: మండలంలోని కిలగాడ ఘాట్ రోడ్డులో కొందరు వ్యక్తులు తొలగిస్తున్న భారీ వృక్షం ఆదివారం మధ్యాహ్నం 33కెవి లైన్‌పై పడింది. దీంతో మూడు విద్యుత్ స్తంభాలు పూర్తిగా విరిగిపోయాయి. ఈ కారణంగా మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ముంచంగిపుట్టు మండలంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామాల్లో అంధకారం నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందితో హుటాహుటిన సంఘటన ప్రాంతానికి వెళ్లి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేస్తున్నారు. రాత్రి 8 గంటలైనా విద్యుత్ సిబ్బంది చీకట్లో సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులో తీవ్రంగా శ్రమిస్తూ పనులు చేస్తున్నారు. విద్యుత్ సరఫరా లేక మండలం మొత్తం చీకటిలో ఉంది. వృక్షాలు తొలగించే వ్యక్తులు, జాగ్రత్తలు పాటించకుండా పనులు చేయడంపై మండల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పొంచి ఉన్న ముప్పు

- ప్రమాదకరంగా దొడిపల్లి వంతెన
- కానరాని రక్షణ గోడలు
- ఆందోళనలో వాహనచోదకులు



రక్షణ గోడ లేక ప్రమాదకరంగా ఉన్న దొడిపల్లి వంతెన

పాడేరు రూరల్: మండలంలో వంజంగి పంచాయతీ దొడిపల్లి గ్రామ సమీపంలో ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. నిత్యం ఈ వంతెన మీదుగా వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి.వంతెనకు ఇరువైపులా రక్షణ గోడ లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిళ్లు భయం భయంతో ప్రయాణాలు సాగిస్తుంటామని చెబుతున్నారు. సమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

వ్యక్తిగత విభేదాలతోనే ఇరువురి ఘర్షణ

దేవరాపల్లి: తెనుగుపూడిలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణకు పార్టీలతో సంబంధం లేదని టీడీపీ, జనసేన పార్టీ నాయకులు తెలిపారు. ఆదివారం రాత్రి తెనుగుపూడిలో ఇరు పార్టీల నాయకులు మాట్లాడారు. గ్రామానికి చెందిన అల్లు వెంకునాయుడుపై శనివారం జరిగిన దాడి విషయంలో వారిద్దరి మధ్య వ్యక్తిగత విభేదాలే తప్పా పార్టీలకు సంబంధం లేదన్నారు. టీడీపీ మండల నాయకుడు సెరకాన సూర్యనారాయణ, జనసేన నాయకుడు గొర్రుపోటు రామ్మూర్తినాయుడు, మాజీ ఎంపీటీసీ పెంటకోట అప్పలనాయుడు, రామచరణ్, అర్జునరావు పాల్గొన్నారు.

కనులపండువగా కాశీ విశ్వేశ్వరస్వామి కల్యాణం

మునగపాక: స్థానిక లింగరాయి గుడిలో ఆదివారం విశాలాక్షి కాశీ విశ్వేశ్వరస్వామి కల్యాణం ఘనంగా జరిగింది. మహా శివరాత్రి పర్వదిన వేడుకల్లో భాగంగా వేద పండితుడు సోమశేఖర శర్మ మంత్రోచ్చారణల మధ్య కల్యాణం కమనీయంగా సాగింది. స్వామిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ఆయన ప్రారంభించారు. ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కోనపల్లి రామ్మోహనరావు, పిన్నమరాజు రవీంద్రరాజు, ఆడారి కాశీబాబు, సూరిశెట్టి రాము, గణేష్, జగన్, ఆడారి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

మోటారు వాహన చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

వై.రామవరం: నూతన మోటారు వాహన చట్టాలపై మండల కేంద్రంలోని ఆటో డ్రైవర్లు, యువతకు ఎస్ఐ బి.రామకృష్ణ అవగాహన కల్పించారు. మోటారు వాహన చట్టాలకు అనుగుణంగా అందరూ వ్యవహరించాలన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే జరిమానాలు చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం నూతన మోటారు వాహన చట్టాల వివరాలు, చెల్లించాల్సి జరిమానాలకు సంబంధించిన కరపత్రాలను సదస్సుకు హాజరైన వారికి ఎస్ఐ రామకృష్ణ అందజేశారు.

రగ్గుల పంపిణీ



కుడబీరులో రగ్గులు పంపిణీ చేస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు

హుకుంపేట: మండలంలోని సంతారి పంచాయతీ కుడబీర గ్రామంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పేద గిరిజనులకు ఆదివారం రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పాడేరు బ్రాంచ్ వైస్ చైర్మన్ ఎస్.గంగరాజు మాట్లాడుతూ గిరిజన యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గిరిజన గ్రామాల్లో రక్త హీనతతో బాధపడుతున్న బాలబాలికలను గుర్తించి మెరుగైన వైద్య సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించేందుకు యువత ముందుకు రావాలని కోరారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు, బాల్య వివాహాల నిరోధానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతినిధులు గౌరిశంకరరావు, ప్రసాద్ నాయుడు, సంజీవ్, రవి, లోహిదాస్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం



ఓపెన్‌హౌస్ కార్యక్రమంలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

వై.రామవరం: శాంతి భద్రత పరిరక్షణే ధ్యేయంగా, నిరంతరం ప్రజాక్షేమం కోసమే పోలీసు వ్యవస్థ పనిచేస్తుందని వై.రామవరం ఎస్ఐ బి.రామకృష్ణ అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ బి.నరసింహమూర్తి ఆదేశాల మేరకు విద్యార్థినులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పోలీసు చట్టాల అమలు, ఆయుధాల పనితీరు, వినియోగం తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మట్లాడుతూ రాజ్యాంగంలో బాలికలు, మహిళల రక్షణ చట్టాలను వివరించారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థినులను ఎస్ఐ కోరారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మోదమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎం.కోడూరు మోదమాంబ

మాడుగుల రూరల్: మండలంలో ఎం. కోడూరు మోదమాంబ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామానికి చెందిన బొమ్మల నాగేశ్వరరావు, దేవి దంపతులు ఆర్థిక సాయంతో అమ్మవారికి ప్రసాద వితరణ చేశారు. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. దూర ప్రాంతాలు నుంచి వచ్చిన భక్తులు పూజలు చేశారు.

కె.జె.పురం మసమ్మతల్లికి ఒడ్డు పండగ

కె.జె.పురంలో మసమ్మ తల్లికి గ్రామానికి చెందిన ఆడారి జగదీష్, బలరామ్ కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ఘటాలతో ఒడ్డు పండగ నిర్వహించారు. స్థానిక చెరకు కాటా ఆవరణలో నూకాంబిక అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. రాత్రికి భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నేడు జిల్లా స్థాయి ఎడ్ల పోటీలు

చీడికాడ: చెట్టుపల్లిలో అభయాంజనేయ స్వామి వేడుక సందర్భంగా ఎడ్ల పందేలను సోమ వారం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా మోదకొండమ్మ పాదాలు తీర్థం



పరుగు తీస్తున్న గుర్రాలు

మాడుగుల: మండలంలోని ఘాట్‌రోడ్ జంక్షన్‌లో వెలసిన మోదకొండమ్మ పాదాలు తీర్థం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తీర్థం సందర్భంగా ఘాట్‌రోడ్ జంక్షన్ జన సంద్రమైంది. భారీ విద్యుద్దీపాలంకరణ, చిత్ర విచిత్రమైన నేల వేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నడుమ అమ్మవారి పాదాలు తీర్థం జరిగింది. కాట్యాడ్ రేస్ గుర్రాలు పరుగు పందెం ఆకట్టుకుంది. ఈ పోటీలను చూడటానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చారు. డప్పువాయిద్యాలు, మహిళల కోలాటాల నడుమ అమ్మవారి ప్రతిరూపమైన 101 ఘటాలతో భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారు నుంచి ఆలయంలో ప్రత్యేక కుంకుమ పూజల్లో భక్తులు పాల్గొన్నారు.